


# క్రీస్తు యేసు

**యేసయ్య మహోన్నతమైన నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యం**: 1 తిమోతి 1:15 - **పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను** వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునైయున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను.

**యేసు అనే మాటకు రక్షకుడు అని అర్థం. క్రీస్తు అనగా అభిషిక్తుడు అని అర్థం. ఇవి ఆయన పేర్లు. ఆయన గుణ లక్షణములను తెలిపే పేర్లు. యేసు క్రీస్తు అనగా రక్షకుడైన అభిషిక్తుడైన రక్షకుడు అని అర్థం. క్రీస్తు యేసు అనగా అభిషిక్తుడైన రక్షకుడు అని అర్థం.**

1. **నేను క్రీస్తులో ఉంటే ఏ శిక్ష లేదు**: రోమా 8:1 కాబట్టి యిప్పుడు **క్రీస్తు యేసు నందున్నవారికి ఏ శిక్షావిధియు లేదు.** క్రైస్తవ మతంలో కాదు. క్రీస్తు లో అనగా అభిషిక్తునిలోని అభిషేకం కలిగి ఉండాలి.
2. **క్రీస్తులో పరిశుద్ధుడుగా ఉండటానికి నేను పిలువబడ్డాను**: 1 కొరింథీ 1:2 - కొరింథులోనున్న దేవుని సంఘమునకు, అనగా **క్రీస్తుయేసునందు పరిశుద్ధపరచబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారికిని** మనకును ప్రభువుగా ఉన్న మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రతి స్థలములో ప్రార్థించు వారికందరికిని శుభమని చెప్పి వ్రాయునది.

   **మనం అన్యులుగా ఉన్నప్పుడు మన మాటలు, చేష్టలు ఎంత అపవిత్రత కలిగి ఉండేవో కాని క్రీస్తును నమ్మిన తర్వాత మన తలంపులు, మాటలు, చేష్టలు అన్నీ మారిపోయాయి.**
3. **నీచుడను తృణీకరింపబడిన నన్ను క్రీస్తు ఏర్పరచుకున్నారు**: 1 కొరింథీ 1:29,30 - ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో **నీచులైనవారిని**, తృణీకరింపబడిన వారిని, **ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు.** అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తు యేసునందున్నారు.

   **ఒకప్పుడు తృణీకరింపబడ్డ మనలను ఆయన మార్చి ఈ రోజు ఎన్నికైన వారిని సైతం దేవుడు మన ద్వారా సిగ్గుపరచుచున్నారు.**
4. **ఆయన మా ప్రభువు మేము ఆయన పరిచారకులము**: 2 కొరింథీ 4:6 - గనుక మేము మమ్మునుగూర్చి ప్రకటించుకొనుటలేదు గాని, క్రీస్తుయేసును గూర్చి ఆయన ప్రభువనియు, మమ్మును గూర్చి, **యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు** ప్రకటించుచున్నాము.

   **ఒకప్పుడు సాతానును ఆరాధించిన మనము, ప్రభువును తెలుసుకున్న తర్వాత ఆయనను మన హృదయాలలో ప్రభువుగా ప్రతిష్టించి, ఆయన పరిచారకులుగా మారాం. పాపాన్ని విడిచి పరిశుద్ధతలోకి వచ్చాము.**
5. **నేను క్రీస్తు యేసు మనస్సు కలిగి యుందును** : ఫిలిప్పీ 2:5 - క్రీస్తుయేసునకు కలిగిన యీ **మనస్సు మీరును కలిగియుండుడి**.

   **పరిశుద్ధ బైబిల్ గ్రంథం అనేక సార్లు సంవత్సరాల తరబడి చదివినా, ఇంకా క్రీస్తు యేసు మనస్సు గురించి తెలుసుకోవాల్సినది ఉంటుంది. నేర్చుకుంటూ, ఆ మనస్సును పొందుకుంటూ మన క్రీస్తుకు వారసులుగా, లోకంలో ఆయన ప్రతినిధులుగా మారాలి.**




6. ఉన్నతమైన పిలుపు, బహుమానం, గురి, అందుకే పరిగెడుతున్నాము: ఫిలిప్పీ 3:14 - క్రీస్తుయేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురి యొద్దకే పరుగెత్తుచున్నాను.

క్రైస్తవులలో 3 రకాలు : **1. తామున్న చోటుకే గురి నడిచి రావాలని కోరుకొనే వారు.**

**2. గురి దగ్గరికి నెమ్మదిగా వెళ్లాం అనుకొనే వారు.**

**3. గురి వద్దకు బహుమానం కోసం పరుగెత్తేవారు.**

**మీరు ఏ కోవలోకి వస్తారు?**

7. క్రీస్తు ఐశ్వర్యము మీ ప్రతి అవసరత తీరుస్తుంది: ఫిలిప్పీ 4:19 - కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును.

ఒకప్పుడు అన్యులుగా చేతులు చాస్తున్న మనం ప్రభువును అంగీకరించాక ప్రభువు మన అవసరతలు తీరుస్తూ ఇతరులకు సహాయం చేసే స్థాయికి ప్రభువు మనలను దీవించారు.

8. మాకు,దేవునికి మధ్య యేసు క్రీస్తు మధ్యవర్తి : 1 తిమోతి 2:5 - దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు.

పాపులైన మనం పరిశుద్ధుడైన దేవుని చేరలేని స్థితిలో ఉండగా, యేసయ్య మన కోసం దిగి వచ్చి తన సొంత రక్తంతో మనకు పరలోకం చేరే కృప ఇచ్చారు. ఈ లోకంలో వేరే ఎవ్వరు అలాంటి బలియాగం చేయలేదు. ఆయన ద్వారానే తప్ప ఎవ్వరు దేవుని చేరలేరు.

9. క్రీస్తులో సద్భక్తితో బ్రతకటానికి నేను హింస పొందుతున్నాను: 2 తిమోతి 3:12 - క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రదకనుద్దేశించు వారందరు హింసపొందుదురు.

అన్యుడిగా నేను చెడ్డ పనులు చేస్తున్నప్పుడు చోద్యం చూసిన ఈ సమాజం. నేను క్రీస్తును అంగీకరించి మంచి వాడిగా మారితే నన్ను హింసించడం మొదలుపెట్టారు. ఇప్పుడు నా ముందు రెండు దారులు. ఒకటి తిరిగి పాత, రోత జీవితానికి వెళ్లిపోవటమా? లేక మనస్సాక్షిని చంపుకోకుండా క్రీస్తును నమ్మి పరిశుద్ధంగా జీవించటమా. నాకు రెండవ దారే క్షేమం.

10. క్రీస్తుయేసు నందు విమోచనము: రోమా 3:24 - కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, **క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా** ఉచితముగా నీతిమంతులని తీర్చబడు చున్నారు.

క్రీస్తు యేసు మన కోసం కలువరి సిలువలో ప్రాణాన్ని పెట్టి మనకు నరకమనే మరణం నుండి విడుదల ఇచ్చారు. కనుక మనం ఆ విమోచనమును ఉచితంగా పొందడమే కాకుండా ఇతరులకు ఉచితంగా అందించాలి.

11. క్రీస్తు యేసు నందు జీవము : రోమా 8:2 - క్రీస్తుయేసు నందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమము నుండి నన్ను విడిపించెను. ఎట్లనగా ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను.

మంచి చేయాలన్న నా ఆశయాలను, నాలోనే దాగియున్న మరెవరో నా చేత పాపకార్యాలు చేయిస్తూ వచ్చారు. ఆ దాగియున్న నియమాన్ని జయించటానికి క్రీస్తు నాకు శక్తిని, బలాన్ని, జీవాన్ని ఇచ్చారు.

12. క్రీస్తు యేసు నందు దేవుని ప్రేమ: రోమా 8:35 - **క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపు వాడెవడు?** శ్రమయైనను బాధయైనను హింసయైనను కరవైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా?




**రోమా 8:38, 39** మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవున వియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైననుమన **ప్రభువైన క్రీస్తు యేసు నందలి దేవుని ప్రేమ** నుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను.

ఏ ప్రేమ చేత క్రీస్తు నన్ను ప్రేమించారో ఆ ప్రేమ నుండి నన్ను ఖడ్గమైన, కరువైన, వస్త్రహీనతమైన మరేది కూడా వేరు చేయలేదు.

**13. క్రీస్తు యేసు వలన స్వాతంత్ర్యము : గలతీ 2:4** - మనలను దాసులుగా చేసికొనవలెనని **క్రీస్తు యేసు వలన మనకు కలిగిన మన స్వాతంత్ర్యమును** వేగు చూచుటకు, రహస్యముగా తేబడి దొంగతనముగా ప్రవేశించిన కపట సహోదరులవలన జరిగినది.

పాపబంధకాల నుండి, బానిసత్వ బంధకాల నుండి విడుదల పొందిన నా స్వాతంత్ర్యాన్ని వేరెవరో వేగు చూస్తూ మరల బానిసగా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. అయితే నేను పాపానికి మరెన్నడు బానిసను కాను.

**14. క్రీస్తు యేసు చేత పట్టబడుట : ఫిలిప్పీ 3:12** – ఇది వరకే నేను గెలిచితిననియైనను, ఇదివరకే సంపూర్ణ సిద్ధి పొందితిననియైనను నేను అనుకొనుటలేదు గాని, నేను దేని నిమిత్తము **క్రీస్తు యేసు చేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను.**

**పాపం చేతిలో బందీనైన నన్ను క్రీస్తు విడిపించారు. బలహీనుడనైన నన్ను ఆయన బలపరచి ఎందునిమిత్తము నన్ను పట్టుకున్నారో ఆ ఉద్దేశ్యం నెరవేర్పులో పరిగెడుతున్నాను.**

**15. క్రీస్తు యేసు నందు ఇంటి వలె కట్టబడాలి : కొలస్సి 2:6** - కావున మీరు ప్రభువైన క్రీస్తుయేసును అంగీకరించిన విధముగా **ఆయన యందు వేరుపారినవారై, యింటి వలె కట్టబడుచు,**

పాపంతో సర్వ నాశనమయిన జీవితాన్ని తిరిగి అందమైన కట్టడంగా క్రీస్తు కడతారు. అలా కట్టబడుతూ అనేక జీవితాలు కట్టబడటానికి మనం ప్రయోజనకారులుగా ఉందాం.

**16. క్రీస్తు యేసు నందు విశ్వాసము : 2 తిమోతి 3:14,15** - **క్రీస్తు యేసు నందుంచవలసిన విశ్వాసము** ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తి గల పరిశుద్ధ లేఖనములను బాల్యము నుండి నీవెరుగుదువు గనుక, నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి యెవరి వలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని, వాటియందు నిలుకడగా ఉండుము.

**క్రీస్తు యేసు నందు విశ్వాసముంచి, శక్తి గల పరిశుద్ధ దేవుని వాక్యాన్ని బాగా చదివి నేర్చుకుంటే అప్పుడు మనకు రక్షణ, జ్ఞానం కలుగుతుంది. అప్పుడు మనం సత్యమందు నిలుకడగా ఉండగలం.**

**యేసు క్రీస్తును అందరూ ఇష్టపడతారు. కాని వారిలో కొందరే అంగీకరిస్తారు. అంగీకరించిన వారిలో కొంత మందే క్రీస్తు నుండి పొందుకున్న శ్రేష్ఠమైన ఈవులను, ఫలాలను అనుభవిస్తూ ఇతరులు వారిలా పరిశుద్ధులుగా ఉండాలని ప్రార్థిస్తారు. ప్రయాసపడుతారు. హింసపొందుతారు. కష్టపడటానికి ఇష్టపడే జీవితమే క్రైస్తవ్యం. పాపాన్ని విడిచే పరిశుద్ధ జీవితమే క్రైస్తవ్యం. నా సంతోషం కాదు ఇతరుల సంతోషం, క్షేమమే పరమార్థం. ఇంత గొప్ప క్రమము, క్రమ శిక్షణ కలిగిన జీవితం కేవలం ఒక్క లెంట్ లో మాత్రమే కాదు. ప్రతి లెంట్ లో నేర్చుకోదగినది. అలా చేయటానికి పరిశుద్ధాత్మ దేవుడు సహాయం దయచేయును గాక. ఆమేన్...! ఆమేన్...! ఆమేన్ ...!**